దరఖాస్తులు గల్లంతు!

- ప్రతీ గ్రామంలో సగానికిపైగా రేషన్ దరఖాస్తులు మాయం
- సంక్షేమ పథకాల జాబితాలో అనర్హులకే చోటు
- మండల వ్యాప్తంగా ప్రజల ఆందోళన
- గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తులు తీసుకుంటామని అధికారుల వెల్లడి



మండల ప్రజా పరిషత్ కార్యాలయం

సైదాపూర్: ప్రజాపాలనలో అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వివిధ పథకాలకు వేలల్లో దరఖాస్తు చేసుకుంటే సగానికిపైగా దరఖాస్తులు గల్లంతు అయ్యాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 815 దరఖాస్తులు రాగా సుమారు వందిని అర్హులను ఎంపిక చేశారని, ప్రతి గ్రామంలో సుమారు వందవరకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పదిలోపు జాబితాను విడుదల చేసినట్టు సమాచారం. అందులో ఎక్కువ శాతం ఒక పార్టీకి చెందినవారు, పెన్షనర్లు, ఉద్యోగుల కుటుంబాలకు చెందినవారి పేర్లు వచ్చాయని, అర్హుల పేర్లు రాలేదనే అయోమంలో ఉన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో రేషన్‌కార్డు దరఖాస్తులు స్వీకరించలేదు. పదేళ్ల నుంచి రేషన్‌కార్డులు పొందనివారు, కార్డుల్లో పేర్లు నమోదు కానివారు అదనంగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇలాంటివారు ఒక్కోగ్రామంలో వందకు పైగానే ఉన్నారు. కాగా ఇటీవల కులగణన సర్వే చేసిన అధికారులు తయారు చేసిన జాబితా ప్రకారం గ్రామానికి కొందరిని అర్హులుగా ఎంపిక చేసి జాబితా విడుదల చేశారు. కులగణన సర్వేలో ఆదాయం ఎక్కువ చెప్పినా, ఇతర వృత్తులు, ఉద్యోగాల కారణంగా పలువురి పేర్లు రాలేదని అధికారులు వెల్లడిస్తున్నారు.అలాగే వచ్చిన పేర్లను నేటి నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఎంపిక చేస్తామని అంటున్నారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నవారికి కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందిస్తుందని సంబురపడిన పలువురికి నిరాశే మిగిలింది. దరఖాస్తుల మాయంపై మండలంలో అన్ని గ్రామాల్లో గందరగోళం నెలకొంది. నేటి నుంచి నిర్వహించే గ్రామసభల్లో అధికారులను, ఇందిరమ్మ కమిటీ సభ్యులను నిలదీయాలని జాబితాలో పేరులేనివారు సిద్ధమవుతున్నారు. రేషన్‌కార్డుల అందజేత నిరంతర ప్రక్రియ అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారని, గ్రామసభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటామని మండల అధికారులు అంటుంటే మరోవైపు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలు అంటున్నారు.

దరఖాస్తులు తీసుకుంటాం



నేటి నుంచి నిర్వహించే గ్రామసభల్లో రేషన్‌కార్డు దరఖాస్తులు తీసుకుంటాం. ఇప్పటికే తయారు చేసిన అర్హుల జాబితాపై గ్రామ సభల్లో చర్చిస్తాం. గ్రామసభ ఆమోదంతోనే రేషన్‌కార్డు మంజూరు చేస్తాం. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలం ఉందా, లేదా ? పథకానికి అర్హుడేనా, కాదా? అనే దానిపై ఇప్పటికే అధికారులతో సర్వే చేయించాం. సర్వేలో తయారు చేసిన జాబితా ప్రకారం గ్రామానికి కేటాయించిన ఇళ్లు ప్రాధాన్యత ప్రకారం మంజూరవుతాయి.

– భూక్యా యాదగిరి, ఎంపీడీవో సైదాపూర్

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

హుజూరాబాద్/జమ్మికుంట/చొప్పదండి/మానకొండూర్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటనలతో విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజానికి తప్పుడు సంకేతం, సందేశం వెళ్తుందని, ఉపాధ్యాయ వృత్తి, విద్యావ్యవస్థ గౌరవం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనలో డీటీఎఫ్, పీఆర్టీయూ నాయకులు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



జమ్మికుంటలో...


చొప్పదండిలో...


మానకొండూర్‌లో...

అర్హులను ఎంపిక చేయాలి

చొప్పదండి: వార్డుల వారీగా నిర్వహించే సమావేశాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సభలను విజయవంతంగా పూర్తి చేయాలని, పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

హుజూరాబాద్: అర్హులకే సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, రాజపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు చెవుల సురేష్, ఇరెల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు సన్మానం


పాడిరైతులను సన్మానిస్తున్న పశువైద్యాధికారులు

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి ఏజెన్సీ ఆధ్వర్యంలో పాడిరైతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడిగేదెలకు ఉచితంగా టీకాలు వేయడంతోపాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు మాధవరావు, రవికుమార్, ఎస్పీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ఆలోచన విరమించుకోవాలి

రామడుగు: ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సముద్రాల అంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డీటీఎఫ్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలిచ్చే పరిస్థితి లేకనే వయస్సు పెంచే ఆలోచన చేస్తోందని, నాలుగు డీఏలతో పాటుగా పీఆర్సీ కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది ఉద్యోగ విరమణ పొందిన వారికి నేటికి ప్రయోజనాలు అందలేదని రాష్ట్ర కౌన్సిలర్ కంకణాల కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రామడుగు డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈ. నరసింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ సర్వర్, ఉపాధ్యక్షులుగా వై. శ్రీనివాస్, గంగ, కార్యదర్శులుగా రమాదేవి, మంజుల, అస్గర్‌అలీ, జిల్లా కౌన్సిలర్లుగా ప్రశాంత్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, రవీందర్, సరోజ, హరిత, శ్రీలత ఎన్నికయ్యారని ఎన్నికల నిర్వహణాధికారులు సముద్రాల అంజయ్య, కంకణాల కిషన్‌రెడ్డి తెలిపారు. అనంతరం నూతన కమిటీని అభినందించారు.

చొప్పదండి: ఉద్యోగ విరమణ పెంపు వార్తలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి కోరారు. చొప్పదండి డీటీఎఫ్ సమావేశంలో మాట్లాడారు. ఏడాదిగా అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి కోరారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, జయలక్ష్మి, కార్యదర్శిగా ఎస్ సురేందర్, జి. వీరేశం, ఎ హరిలీల ఎన్నికయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ క్యాలెండర్‌ను పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాడ శేఖర్‌రెడ్డి, నాయకులు లంక మల్లేశం, నెరెళ్ల మల్లేశం,చాడ ప్రభాకర్‌రెడ్డిలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


అక్షిత్

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి బి. అక్షిత్ హ్యాండ్ బాల్ పోటీల్లో సత్తా చాటాడని స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలో 46వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించగా జిల్లా జట్టు నుంచి పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించాడని వివరించారు. అక్షిత్‌ను కరస్పాండెంట్ శ్రీనివాస్, కో కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు గోదాం ప్రారంభోత్సవం

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి ప్రాథమిక విశాల సహకార సంఘం పరిధిలో నిర్మించిన గోదాం, మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ప్రారంభిస్తారని సంఘ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి సోమవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. జనగామ జిల్లా చిల్పూరు మండలం ఫతేపురా గ్రామానికి చెందిన గుగులోతు లక్పతి (35) కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వైపు వస్తుండగా మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో లక్పతితోపాటు అయన భార్య గాయపడగా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రిమాండ్‌కు తరలింపు

శంకరపట్నం: చిట్టీడబ్బుల కోసం దాడి చేసిన కల్లూరి శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించినట్టు కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్యను చిట్టీ డబ్బుల కోసం శ్రీనివాస్ దాడిచేయయగా కోమాలోకి వెళ్లాడని బాధితుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ అనంతరం సోమవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

మాలమహానాడు నాయకులపై ఫిర్యాదు

హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు నాయకులు పసుల రామ్మూర్తి, జూపాక సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాలు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సోమవారం సీఐ తిరుమల్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ముప్పై ఏళ్లుగా అన్ని వర్గాల ప్రజలు కోసం కృషి చేస్తున్న మందకృష్ణపై నాయకులు విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

చర్యలు తీసుకోవాలని..

జమ్మికుంట: రాజకీయం, వ్యక్తిగతంగా తప్పుడు ఆరోపణలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని కోరపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య సోమవారం తహసీల్దార్ రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. 18న కోరపల్లికి చెందిన కొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం అవాస్తవమని ఫిర్యాదు చేసి న వారితో భూతగాదాలు లేవని గిట్టని వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిమ్మాపూర్: మండంలోని రేణికుంట గ్రామానికి చెందిన గంగారపు సుమలత భర్త ఇటీవల మృతిచెందాడు. సుమలత పదో తరగతి (2006–2007 బ్యాచ్) స్నేహితులు రూ.60,000 సేకరించారు. అనంతరం పోస్టాఫీస్‌లో సుమలత పిల్లల పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: సంగారెడ్డి పట్టణంలో 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి శీలం అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ విధానాలను తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించి, ప్రజాస్వామ్య హక్కులపై నిర్బంధం కొనసాగిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రమేష్, కిషోర్, సతీష్, కుమార్, మహేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

మానకొండూర్: మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ పిలుపునిచ్చారు. మండలంలోని సదాశివపల్లిలో మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి శాతరాజు భద్రయ్య, మండల కమిటీ సభ్యులు చౌదరి సంపత్, స్థానిక నాయకులు పొలవేణి శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, కె.పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, తదితరులు

గంగాధర: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను విడుదల చేయడంతో మండలంలోని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చొప్పదండి నియోజకవర్గంలోని రైతుల సంక్షేమమే ఎమ్మెల్యే లక్ష్యమని, యాసంగి పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందజేస్తున్న ఘనత ప్రభుత్వం, ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కసారి కూడా జనవరిలో నీటిని విడుదల చేయలేదని, రైతులను అవమానపరిచిన చరిత్ర బీఆర్ఎస్‌దని గుర్తు చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయించిన ఎమ్మెల్యేకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, మండల అధ్యక్షుడు మనోహర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కాలువను పరిశీలించిన అధికారులు


నీటిని పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని సోమవారం ఎస్సారెస్పీ అధికారులు పరిశీలించారు. 'రోడ్డెక్కిన సాగునీరు' అనే కథనం సాక్షిలో ప్రచురితం కావడంతో డీఈ కవిత, ఎంపీవో ప్రభాకర్ స్పందించారు. కేశవపట్నం ఎత్తుగడ్డ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న, ఇళ్ల ఎదుట నిలిచిన నీటిని పరిశీలించారు. సాగునీటి కాలువ కోసం నిర్మించిన కల్వర్టు, కాలువ పూడుకుపోవడంతో కాలువ నీరు ఇళ్లలోకి రావడం, రోడ్డుపై ప్రవహించినట్టు గుర్తించారు. నక్షా ప్రకారం కాలువ పూడికతీత పనులు ఉపాధిహామీ కూలీలతో చేపట్టాలని కార్యదర్శి నర్సయ్యను ఆదేశించారు. దిగువ రైతులు ప్రధానకాలువ నుంచి ఎక్కువ మొత్తంలో రాత్రివేళ నీటిని వదలడంతో రోడ్డు, ఇళ్లలోకి నీరు వచ్చిందన్నారు.

అల్పాహార సామగ్రి అందజేత


సామగ్రి అందజేస్తున్న దాతలు

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల కోసం సోమవారం దాతలు గ్రామానికి చెందిన నాయకులు గాదె నర్సయ్య, వంగ ప్రభాకర్‌లు దొమ్మాటి శంకరయ్య అల్పాహార సామగ్రి, బూర్ల మల్లేశం నుంచి, వెంకటరాములు విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మనోజ్‌కుమార్, యోగేశ్, గ్రంథాలయ మాజీ సభ్యురాలు బండ శకుంతల, హెచ్‌ఎం కన్నం రమేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధిలో పద్మశాలీకాలనీలో హిమ్మత్‌నగర్ వెళ్లే రోడ్డు పక్కన మిషన్‌భగీరథ పైపులైన్‌కు అధికారులు మరమ్మతులు చేశారు. లీకేజీతో నీరు వృథాగా పోతోందని ఈ నెల 19న 'సాక్షి'లో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు కథనానికి స్పందించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చదువుతోనే భవిష్యత్

సైదాపూర్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని, చదువుతోనే భవిష్యత్ అని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సైదాపూర్, వెన్కెపల్లి గ్రామాల్లో బడీడు పిల్లల సర్వే చేశారు. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు బడిలో ఉండాలని, పిల్లలను బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రెడ్డి, పీఆర్పీలు సోయం రమేష్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఆకునూర్ జెడ్పీహెచ్ఎస్ పరిధి వెంకటేశ్వర్లపల్లిలో పదో తరగతి విద్యార్థుల ఇళ్లను హెచ్‌ఎం రామస్వామి, బాస్కర్, రవీందర్‌రెడ్డి, సుధాకర్ పరిశీలించారు. ఇళ్ల వద్ద విద్యార్థులు చదువుకుంటున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

హుజూరాబాద్: మండలంలో అన్ని గ్రామాల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు సీఆర్పీలు సర్వే చేశారు. ఈనెల 16 నుంచి మొదలైన సర్వే 25తో ముగుస్తుందన్నారు. కోళ్ల ఫారాలు, ఇటుకబట్టీలు, వలస కూలీలు అధికంగా ఉండే ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గుండా రాజిరెడ్డి, దామోదరాచారి, మాదం రవి బాబు, ఎస్. రమేష్, సుధామన్, అమరేందర్, ఐఆర్పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామసభలను అడ్డుకుంటే తరిమికొడతారు'


మాట్లాడుతున్న రమణారెడ్డి, నాయకులు

తిమ్మాపూర్: సంక్షేమ పథకాల అమలు కోసం మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ సభలను అడ్డుకోవాలిన మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆరోపించారు. సభలను అడ్డుకుంటే ప్రజలే తరిమికొడతారని, కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. సోమవారం ఎల్‌ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు గుంట భూమి లేని మాజీ ఎమ్మెల్యేకు రూ.కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై ఆరోపణలు సరికాదన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస రావు, గోపు మల్లారెడ్డి, బండారి రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, బూదారపు శ్రీనివాస్, ఎండీ హసన్, మార్క నర్సయ్య, పోలు రమేశ్, గోదారి శెట్టిబాబు, గొట్టిముక్కల సంపత్ రెడ్డి,ఆసిఫ్ పాషా, పెంట వినోద్, ఎండీ రజాక్, తాళ్లపల్లి శ్రీనివాస్, అలువాల కుమార్, దుర్గాప్రసాద్, మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **ఏకాగ్రతతో చదవాలి**

గంగాధర: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు సాధ్యమని ప్రముఖ మోటివేటర్ సాయిబాబు అన్నారు. మండలంలోని గర్శకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు అడిక్ట్ కావడం వల్ల మంచి కన్న చెడు వ్యాపకాలే పెరుగుతాయన్నారు. విద్యార్థులు మంచిని మాత్రమే స్వీకరించాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో స్మార్ట్ ఫోన్లను పక్కన పెట్టి చదువుపై దృష్టి సారించాలని , విద్యాభివృద్ధి దశలో చెడు వ్యసనాలు, అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్త పడితే భవిష్యత్ బాగుపడుతుందనే విషయం గ్రహించాలన్నారు. క్రమశిక్షణ, శ్రద్ధాసక్తుల వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా ఆశించిన మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు బోధించే అంశాలు, చెప్పే పాఠ్యంశాలు శ్రద్ధగా వింటే మేధాశక్తి పెరుగుతుందన్నారు.

- **మద్యానికి బానిసకావొద్దు**

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏడు మండలాల్లో మద్యానికి బానిసైన చాలా కుటుంబాలు వీధిన పడ్డాయని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులున్నాయని, నాణ్యతలేని మద్యం వల్ల చాలా మంది యువకులు మృత్యువాత పడుతున్నారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపులను రద్దుచేస్తామని చెప్పిన మాట అమలుకావడం లేదన్నారు. ఊసేలేదన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన నియోజకవర్గంలో బెల్ట్‌షాపులను తొలగించారని, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అదే మార్గంలో పయనించాలని కోరారు. లేదంటే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

- **పనులు ప్రారంభం**

శంకరపట్నం: మండల ంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సోమవారం మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారులు ముగ్గు పోశారు. మంగళవారం నుంచి గ్రామసభలు జరుగుతున్నాయని, ఎంపికైన లబ్ధిదారులకు మోడల్ నమూనాతో ఇల్లు నిర్మించనున్నామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నిరుపేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి

చొప్పదండి: నిరుపేదలను ఆదుకోవడంలో సంతృప్తి లభిస్తుందని, చొప్పదండి లయన్స్ క్లబ్ ఈ కోవలో ముందంజలో ఉందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. చొప్పదండి లయన్స్ క్లబ్ చార్టర్ నైట్ వేడుకల సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు, మహిళకు కుట్టుమిషన్, రైతుకు స్ప్రేయర్ ఉచితంగా అందించారు. దాతల సాయంతో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు.

- **నిరుపేద కుటుంబానికి చేయూత**

హుజూరాబాద్: పట్టణానికి చెందిన మాడ మహేందర్ ఇటీవల మృతి చెందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్ సూచన మేరకు ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమవారం మృతుడి కుటుంబానికి రూ.1.18 లక్షలు అందజేసి ఉదారత చాటుకున్నారు.

- **విద్యార్థులు వాహనాలు నడపొద్దు**

హుజూరాబాద్: విద్యార్థులు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామంఏకశిల పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మైనర్లు వాహనలను నడపటం ద్వారా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ప్రమాదాలు జరిగితే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

- **ఉపకాల్వను వినియోగంలోకి తేవాలి**

గన్నేరువరం: మండలంలోని కూనవానిపల్లె నుంచి మైలారం వరకు ఉన్న సాగునీటి ఉపకాల్వ 3 ఆర్‌ను వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు. మైలారం గ్రామానికి చెందిన నాయకులు, రైతులు సోమవారం ఎమ్మెల్యే, అధికారులను వేడుకున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వకు అనుసంధానంగా చేపట్టిన ఉపకాల్వ8 ద్వారా నీటి విడుదల జరుగుతుందని, ఈ కాల్వను నమ్ముకుని రైతులు పంటలను సాగు చేశామని, ఉపకాల్వ 3ఆర్‌లో పిచ్చి మొక్కలు, మట్టితో కాల్వ పూడుకుపోయిందని, దీంతో నీటి ప్రవాహం నిలిచిపోయిందని, సాగు చేసిన పంటలునీరు అందకా ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.